
సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే యెండల

## బీజేపీ సభ్యత్వంతో వికసిత్ భారత్‌లో భాగస్వామ్యం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): బీజేపీలో సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రధాని సంకల్పించిన వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావచ్చునని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే, జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ దీన్‌దయాల్‌నగర్‌లో బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యెండల మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో బీజేపీని శక్తివంతమైన పార్టీగా మార్చారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పని చేస్తే భవిష్యత్‌లో పార్టీకి తిరుగుండదని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ నాలుగేళ్ల తర్వాత తెలంగాణలో బీజేపీ అధికార పీఠం అధిష్ఠించడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోవర్ధన్‌రెడ్డి సబితారాజశేఖర్‌రెడ్డి, భీమ్‌రాజ్, హరినాథ్‌రెడ్డి, భిక్షపతిచారి, గౌరీశంకర్, పార్టీ నాయకులు ప్రభాకర్, సోమేశ్వర్, మధు, బుచ్చిరాములు, జగన్ పాల్గొన్నారు.


శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి, కమిషనర్ అమరేందర్‌రెడ్డి

## శ్మశానవాటికను పరిశీలించిన ఆర్డీవో

హయత్‌నగర్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): కమ్మగూడ ఇందిరమ్మకాలనీ, సుందరయ్యనగర్, లక్ష్మీనగర్‌కు చెందిన శ్మశానవాటిక కబ్జాకు గురవుతుందని ఫిర్యాదు రావడంతో శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డితో కలిసి శ్మశానవాటికను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వేస్తున్న రోడ్డును పరిశీలించారు. శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని పూర్తిగా మరోసారి సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేస్తామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొశిక ఐలయ్య, నాయకులు కుంట గోపాల్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన కార్పొరేటర్

సైదాబాద్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ఏక్ పెడ్ మా కే నామ్ (తల్లితో కలిసి తల్లిపేరుతో మొక్క) అభియాన్‌లో భాగంగా శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీ పార్కులో విద్యార్థులతో కలిసి కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మోదీ ఏక్ పెడ్ మా కే నామ్ అభియాన్‌ను ప్రారంభించారని, ప్రతి ఒక్కరూ ఇందులో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీవకోటికి జీవనాధారం మొక్కే: కార్పొరేటర్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): జీవకోటి మనుగడకు జీవనాధారం మొక్కే అని కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం నాగోల్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్‌కాలనీలో 75వ వనమహోత్సవ కార్యక్రమాన్ని హార్టికల్చర్ ఏఈ మేధా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల అరుణ తన మాతృమూర్తి పేరిట మొక్కను నాటారు. కార్యక్రమంలో హార్టికల్చర్ సూపర్‌వైజర్ మానస, బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు సురేందర్‌యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


శివకుమార్‌గౌడ్‌కు లడ్డూ అందజేస్తున్న యూత్‌ఫర్ యాంటీకరప్షన్ ప్రతినిధులు

## గణపతి లడ్డూను దక్కించుకున్న సూపరింటెండెంట్

సైదాబాద్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను వేలంలో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ రూ.16,116వేలకు సొంతం చేసుకున్నారు. శుక్రవారం జైలు కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు సంస్థ ప్రతినిధులు లడ్డూను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ అన్నపూర్ణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.


లడ్డూ వేలం డబ్బును ఉత్సవ నిర్వాహకులకు అందజేస్తున్న బంగారు బాబు

## లడ్డూ వేలం డబ్బు అందజేత

సరూర్‌నగర్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో శ్రీసీతారామాంజనేయ భక్త సమాజం, భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద గతేడాది వేలంలో వినాయకుడి లడ్డూను రూ.2.21లక్షలకు దక్కించుకున్న స్థానిక భక్తుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బంగారు బాబు సదరు సొమ్మును గురువారం రాత్రి ఉత్సవ నిర్వాహకులకు అందజేశారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఉత్సవ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించి లడ్డూ ప్రసాదం అందజేశారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.11వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా నాలుగవ అదనపు సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.నాగరాజు శుక్రవారం తీర్పునిచ్చారు. పీపీ శోభారాణి తెలిపిన వివరాల ప్రకారం.. ఆటో డ్రైవర్ శివకుమార్(29) 2020వ సంవత్సరం సెప్టెంబర్ 29వ తేదీన పాసింజర్ల కోసం వేచి ఉండగా పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఉస్మాన్ హుస్సేన్ మద్యం మత్తులో తనను తన ఇంటి వద్ద వదిలిపెట్టాలని చెప్పి ఆటో ఎక్కాడు. అక్కడి నుండి సరైన మార్గం చెప్పకుండా శివకుమార్‌ను అటూ..ఇటూ.. తిప్పసాగాడు. దీంతో అనుమానం వచ్చి ఉస్మాన్ హుస్సేను ఆటో దిగమని కోరగా.. దుర్భాశలాడుతూ కోఠిలోని ఓ మద్యం దుకాణంలో మద్యం తీసుకుని సేవిస్తూ చివరికి ఆటోడ్రైవర్ శివకుమార్ ఛాతిపై బ్లేడుతో విచక్షణ రహితంగా దాడి చేసి ఆటో తాళాలు లాక్కున్నాడు. దీంతో శివకుమార్ ప్రాణభయంతో పారిపోయి పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాక్షాధారాలను సేకరించిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన నాలుగవ అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి నిందితునికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 11వేలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.


బడంగ్‌పేట్‌లో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తదితరులు


బాలాపూర్ గణపయ్యను దర్శించుకున్న ఎంపీ ఈటలకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి


వాసవీకాలనీలో రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయమూర్తులు నిష్కాపత్రుడు, పెనుమల గోపిక నాగ శ్రావ్య, ఎస్ఈ మాధవరెడ్డి దంపతుల పూజలు

# భక్తిశ్రద్ధలతో గణపయ్యకు ఘనంగా పూజలు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): ఏకదంతాయ.. వక్రతుండాయ.. అంటూ వినాయకుడిని భక్తులు భక్తి శ్రద్ధలతో కొలుస్తున్నారు. వాడవాడలో, గల్లీ గల్లీలో గణనాథుడికి ఘనంగా పూజలు నిర్వహించారు. బాలాపూర్ వినాయకుడిని గురువారం రాత్రి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ తదితరులు దర్శించుకుని పూజలు చేయగా, వారిని ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి సన్మానించి లడ్డూ ప్రసాదం అందజేశారు.

### బడంగ్‌పేట్‌లో కోమటిరెడ్డి పూజలు

బడంగ్‌పేట్‌లో శ్రీవీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద గురువారం రాత్రి రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, బడంగ్‌పేట్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి తదితరులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

### వాసవీకాలనీలో..

ఎల్బీనగర్ : వాసవీకాలనీలో వినాయకుడిని రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయమూర్తులు నిష్కాపత్రుడు, పెనుమల గోపిక నాగశ్రావ్యతో పాటు విద్యుత్ ఎస్ఈ మాధవరెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేకపూజలో పాల్గొన్నారు.


బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో భక్తుల పూజందుకుంటున్న గజాననుడు


రాగన్నగూడ పాటిగూడలో పూజల్లో మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, కౌన్సిలర్ కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి తదితరులు


హయత్‌నగర్ ఏరియాలో వీరన్నగుట్ట, శ్రీకృష్ణహిల్స్, మధురానగర్‌లలో గణేశుడిని దర్శించుకుంటున్న మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, నాగరాజు, నర్సింహగౌడ్


పీ అండ్ టీ కాలనీలో గణేశ్ యువభక్తి మండలి ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీకృష్ణ అవతార గణనాథుని వద్ద కుంకుమార్చన చేస్తున్న మహిళలు


శ్రీలక్ష్మీ అంబికా రెసిడెన్సీలో పార్వతీ పుత్రునికి హారతి ఇస్తున్న మహిళలు

## బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య గురువారం చోటుచేసుకున్న మాటల యుద్ధం.. తదనంతర పరిణామాల నేపథ్యంలో శుక్రవారం మళ్లీ ఆందోళనలు చోటు చేసుకునే అవకాశం ఉండడంతో పోలీసులు శుక్రవారం బీఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టు చేశారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలను గృహ నిర్బంధం చేసిన పోలీసులు.. మరి కొందరిని అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. వ్యక్తిగత పూజీకత్తుపై సాయంత్రం వారిని విడుదల చేశారు.


సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు సలీం, తిలక్‌రావు, రాజిరెడ్డి తదితరులు

### సరూర్‌నగర్ పీఎస్‌లో..

ఎల్బీనగర్ : సరూర్‌నగర్, లింగోజిగూడ, చంపాపేట, గడ్డిఅన్నారం ప్రాంతాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను సరూర్‌నగర్ పోలీసులు శుక్రవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సరూర్‌నగర్ డివిజన్ మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ సలీం, లింగోజిగూడ డివిజన్ మాజీ అధ్యక్షుడు పగిడిమర్రి తిలక్‌రావు, బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, యువజన విభాగం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయ్ గౌడ్, శేఖర్ రజక తదితరులను చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు.


మీర్‌పేట్ పీఎస్‌లో బీఆర్ఎస్ నేతలు భూపేశ్‌గౌడ్, రమేశ్ తదితరులు

వనస్థలిపురం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి, హరీష్‌రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ శుక్రవారం వనస్థలిపురం కాంప్లెక్స్ వద్ద బీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, లగోని శ్రీధర్, సత్తిరెడ్డి, కిరణ్, రవికుమార్, రాజేష్, రాంబాబు, కిట్టు, సురేష్, భరత్, రాఘవేందర్, బన్నీ, నర్సింగ్ చిన్న పాల్గొన్నారు.

## నిమజ్జనానికి 2వేల మంది పోలీసులు

● సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జన ఊరేగింపును పురస్కరించుకుని సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో 2వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. గణేశ్ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఆయన ఆంధ్రజ్యోతికి వివరించారు. మలక్‌పేట, సైదాబాద్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట ఏసీపీ డివిజన్ల పరిధిలో గల 10 పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 1200లకు పైగా గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి ఘనంగా పూజలు జరుపుకుంటున్నారన్నారు. ఈనెల 17న జరగనున్న గణేశ్ నిమజ్జన భారీ ఊరేగింపుకు ముందే సుమారు 7వందల వరకు గణేశ్ విగ్రహాలు నిమజ్జనం కానున్నాయన్నారు. సమస్యాత్మకమైన, అతి సున్నితమైన 50 ప్రాంతాలను గుర్తించి పోలీసులతో పికెట్లను ఏర్పాటు చేశామన్నారు.

### రౌడీషీటర్ల బైండోవర్

గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ముందు జాగ్రత్తల చర్యల్లో భాగంగా జోన్ పరిధిలో గల 10 పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన సుమారు 2వందల మంది రౌడీ షీటర్లను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు బైండోవర్ చేసినట్లు ఆయన వివరించారు. జోన్ పరిధిలో ఉన్న 8వందల మంది పోలీసులతోపాటు మరో 1200ల మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీటితోపాటు ర్యాపిడ్ యాక్షన్ బలగాలు, సీఆర్‌పీఎఫ్, టీజీఎస్‌పీ ఆర్మ్‌డ్ రిజర్వు దళాలను కూడా రంగంలోకి దింపుతున్నట్లు డీసీపీ వివరించారు.


సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్

## చెత్తను తరలించే రిక్షాల పంపిణీ

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో చెత్తను తరలించేందుకు 116 రిక్షాలు అవసరమైతే అందులో కేవలం 50 రిక్షాలనే మంజూరు చేశారని కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం మూసారాంబాగ్‌లో జీహెచ్ఎంసీ శానిటేషన్ జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏలు వైశ్రీనివాస్, నర్సింగ్, ముజీబ్, సుభాష్, అక్షయ్, గణేశ్, శ్రీనివాస్‌లతో కలిసి శానిటేషన్ సిబ్బందికి చెత్తను తరలించే రిక్షాలను కార్పొరేటర్ పంపిణీ చేశారు. చెత్తను తరలించేందుకు మామూలు రిక్షాలు కాకుండా చార్జింగ్ చేసుకునే ఎలక్ట్రిక్ రిక్షాలను జీహెచ్ఎంసీ కొనుగోలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.


చెత్తను తరలించే రిక్షాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి


రిక్షాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అరుణ

### పారిశుధ్య పనులపై అలసత్వం వద్దు

సైదాబాద్ : సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పారిశుధ్య సమస్యలపై సిబ్బంది అలసత్వం వహించవద్దని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సైదాబాద్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు రిక్షాలు పంపిణీ చేశారు. పనులలో ఇబ్బందులు కలిగితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి, నేతలు రాజేష్, వినయ్, నవీన్, కార్తీక్ పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మావతి, హెడ్‌మాస్టర్ లక్ష్మీదేవి

## జోనల్ కబడ్డీ ఛాంపియన్లుగా నాగోల్ జట్లు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ డేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాగోల్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ఉప్పల్ జోనల్ లెవల్ కబడ్డీ అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో నాగోల్ జిల్లా పరిషత్ పాఠశాల జట్లు ఛాంపియన్‌గా నిలిచాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీల్లో నాగోల్ పాఠశాల ఉప్పల్ సత్యసాయి హైస్కూల్ జట్టుపై విజయం సాధించింది. అండర్-14 బాలుర కబడ్డీ ఫైనల్స్‌లో నాగోల్ ప్రభుత్వ పాఠశాల జట్టు ఉప్పల్ ఇందిరపాఠశాల జట్టుపై విజయం సాధించింది. బాలికల విభాగంలో అండర్-17 విభాగంలో ఉప్పల్ ప్రభుత్వ పాఠశాల జట్టు ప్రథమ స్థానం, మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల ద్వితీయ స్థానం సాధించగా అండర్-14 విభాగంలో ఉప్పల్ సత్యసాయి పాఠశాల ప్రథమ స్థానం, ఉప్పల్ శ్రీనివాస స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. నాగోల్ ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ లక్ష్మీదేవి, ఉప్పల్ జోనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మావతి, నోసా అధ్యక్షుడు కందికంటి కన్నాగౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, డోనర్ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, అనంతుల శ్రీనివాస్‌రెడ్డి, పల్లె లింగంగౌడ్, ఉమామహేశ్వర్‌గుప్తా, మహేందర్, సహదేవ్, పీఈటీలు శంకర్, మమత, ఉపాధ్యాయులు రవికుమార్, విమల పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఐఐటీ అండ్ నీట్ బీసీ గురుకుల విద్యార్థులు జిల్లాస్థాయి ఖోఖో, వాలీబాల్ అండర్-19 పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థులు సత్తాచాటి జిల్లా మొదటి బహుమతి దక్కించుకున్నట్లు గురుకుల కళాశాల ప్రధానాచార్యులు పీవీఆర్‌రెడ్డి తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో, వాలీబాల్ పోటీలకు రెండు టీంలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో రెండు టీంల విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రమేష్, వీరబాబు, ఏటీపీ మంజుల, డీడబ్ల్యు జగన్, ఐసీటీ అఖిల్, లింగం, శ్రీకాంత్, మల్లయ్య పాల్గొన్నారు.

## ఉత్తమ్ కమిటీని ఉపసంహరించుకోవాలి

● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బేర

ఎల్బీనగర్, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును అమలుపై ప్రభుత్వం నియమించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీని ఉపసంహరించుకోవాలని రంగారెడ్డి జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సరూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన కమిటీలో మాల సామాజిక వర్గానికి చెందిన మంత్రిని ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. మంత్రుల కమిటీలోనే మాలలకు అన్యాయం జరిగిందని ఇక ఉత్తమ్ కమిటీ ద్వారా మాలలకు ఎలా న్యాయం జరుగుతుందన్నారు. సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగల కంటే మాల, ఉపకులాల జనాభానే ఎక్కువగా ఉంటుందన్నారు. మొండిగా వ్యవహరిస్తే రేవంత్‌రెడ్డికి తెలంగాణలో ఉన్న 50 లక్షల మంది మాలోళ్ల తడాకా చూపిస్తామని ఆయన హెచ్చరించారు. అసలు ప్రభుత్వం ఏకపక్షంగా వర్గీకరణను అమలు చేయాలనుకున్నప్పుడు మంత్రుల కమిటీ ఎందుకని ఆయన ప్రశ్నించారు. కేవలం మాలలను, మాల ఉపకులాలను మోసం చేయడానికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్లు స్పష్టంగా కనిస్తుందన్నారు.

## రేపు సీరత్ ఎక్స్ పో-2024

సైదాబాద్ : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్(జేఐహెచ్) ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మలక్‌పేటశాఖ అధ్యక్షుడు మహ్మద్ ముజీబిల్ అలా తెలిపారు. శుక్రవారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 10నుంచి సాయంత్రం 6గంటల వరకు సైదాబాద్‌లోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలపై సీరత్ ఎక్స్ పో-2024 పేరుతో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రదర్శనలో మహ్మద్ ప్రవక్త బాల్యం, వివాహం, సామాజిక జీవితం, బోధనలపై డాక్యుమెంటరీ ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రదర్శనను ఎమ్మెల్యే బలాల, జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షుడు అజారుద్దీన్, డాక్టర్ ముజసీర్ అహ్మద్ ప్రారంభిస్తారని తెలిపారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

చంపాపేట : మతిస్థిమితం లేని వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌బాబానగర్ సీ బ్లాక్‌కు చెందిన సయ్యద్ జహీర్(35) మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 11న అతను ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పద్మయ్య తెలిపారు.

# సీతారాం ఏచూరికి ఘనంగా నివాళి


చంపాపేట డివిజన్ సాగర్‌రింగ్ రోడ్‌లో సంతాపసభలో సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న సర్కిల్ కన్వీనర్ ఎల్లయ్య, ధర్మనాయక్

చంపాపేట, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సీతారాం ఏచూరి మృతి పట్ల సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. చంపాపేట డివిజన్ సాగర్‌రింగ్ రోడ్ చౌరస్తాలో సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏచూరి సంతాపసభను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎల్బీనగర్ అడ్డా అధ్యక్షుడు లాట్ల లక్ష్మణ్, నల్ల వెంకటయ్య, యాదయ్య, కృష్ణ, సుధాకర్‌రెడ్డి, శాంతికుమారి, అజయ్, హమాలీలు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. ఏచూరి మరణం పట్ల సీపీఐ నాయకులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక, కర్షక, పేద మధ్యతరగతి ప్రజల అభివృద్ధి కోసం ఆయన నిరంతరం పరితపించేవారని రవీంద్రచారి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నవనీత, అరుణ, యాదగిరి, మధు, ప్రసాద్, నిరంజన్, సైదులు పాల్గొన్నారు.

### ఏచూరికి కామ్రేడ్ల లాల్ సలాం

సరూర్‌నగర్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత సీతారామ్ ఏచూరికి కామ్రేడ్లు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం బాలాపూర్ చౌరస్తాలో, మీర్‌పేట్ చౌరస్తాలో సీపీఎం బాలాపూర్ మండల శాఖ కార్యదర్శి ఎం.యాదయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఏచూరి ఫోటోకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం కార్మిక నాయకుడు రాజలింగం, మీర్‌పేట్ శాఖ కార్యదర్శి బి.ప్రకాశ్, యాదగిరిచారి, దాసరి బాబు, మల్లికార్జున్, మల్లేశ్, యాదయ్య, భాస్కర్ పాల్గొన్నారు.


కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


బాలాపూర్ చౌరస్తాలో, మీర్‌పేట్ చౌరస్తాలో ఏచూరికి నివాళులర్పిస్తున్న యాదయ్య తదితరులు

సంతోష్‌నగర్: వామపక్ష ఉద్యమాలకు మార్గదర్శి సీతారాం ఏచూరి అని సీపీఐ(ఎం) తెలంగాణ కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ కొనియాడారు. గ్రేటర్ హైదరాబాద్ సౌత్‌కమిటీ, మలక్‌పేట, యాకత్‌పుర జోన్‌కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంతోష్‌నగర్‌లోని అలంఖుంద్‌మిరి భవన్ కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సౌత్‌జిల్లా కమిటీ నాయకులు బాలునాయక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు విఠల్, నాగేశ్వర్, కోటయ్య, ఎం.మీనా, జిల్లా కమిటీ నాయకులు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.